క్లుప్తంగా

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. బోనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజరులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

మీర్‌పేట: మీర్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.సైదులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకలో లెక్చరర్లు నర్సింహాచారి, అనురాధ, రాంబాబు, శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ ప్రతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: అనారోగ్యంతో బాధ పడుతున్న జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన సంగ్రామ్ అనే వ్యక్తికి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ ప్రతులు అందజేశారు. అనారోగ్యం బారిన పడిన విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ లక్ష్మీనారాయణ బాధితుడిచే దరఖాస్తు చేయించి ఎమ్మెల్యేకు అర్జీ ఇచ్చారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యింది. ఇందుకు సంబంధించిన ప్రతులను ఆమె మంగళవారం సంగ్రామ్‌కు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యటన

కందుకూరు: మండల పరిధిలోని మాదాపూర్, గూడూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఎమ్మెల్యే సబితారెడ్డి బుధవారం రానున్నారని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మాదాపూర్‌లో, 10.45 గంటలకు గూడూరులో నిర్వహించనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీకి చెందిన నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

సీఐకి శుభాకాంక్షల వెల్లువ



బాధ్యతలు చేపట్టిన సీఐని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కందుకూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎండీ మక్బూల్‌జానీని మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డితో పాటు ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి ఆధ్వర్యంలో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సులేమాన్, నాయకులు అంజిరెడ్డి, పాండురంగారెడ్డి, బాబు, సురేందర్, ఖాజామోహినుద్దీన్, లక్ష్మణ్, వెంకటేష్, కృష్ణ, గణేష్, బాలకృష్ణ, జగన్, దేవేందర్‌రెడ్డి, శ్రీను, నర్సింహ, సాయిలు, శ్రీకాంత్, విజయ్, కుమార్, ప్రశాంత్, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటేష్, శేఖర్, శ్రీశైలం, రాఘవేందర్, జగదీష్, ప్రభు, నవీన్, అనిల్ పాల్గొన్నారు.

నేడు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువు సమీపంలో ఉన్న గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయని, నివారణ కోసం బుధవారం ఉదయం 7 గంటల నుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడతామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు కూడా పాల్గొనాలని కోరారు.

అధిక లోడు.. ప్రయాణికులకు ఇక్కట్లు

ఇష్టానుసారంగా టిప్పర్ల రవాణా

- కంకర, దుమ్ముతో స్థానికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కందుకూరు చౌరస్తా మీదుగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్



శ్రీశైలం రహదారిపై అధిక లోడుతో వెళ్తున్న లారీ

కందుకూరు: మండలానికి చెందిన ఓ వ్యక్తి కారులో రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్నారు. ఆ క్రమంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ నుంచి కంకర జారి కారు అద్దంపై పడి ధ్వంసమైంది. గత్యంతరం లేక ఆయన సొంత డబ్బులు వెచ్చించి అద్దం మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఓ జంట బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆ సమయంలో ఓవర్ లోడుతో వెళ్తున్న టిప్పర్ నుంచి డస్టు లేచి బైక్ నడిపే వ్యక్తి కళ్లల్లో పడింది. దీంతో అదుపు తప్పి వారు కిందపడటంతో గాయాలపాలైయ్యారు. ఓవర్ లోడ్ వాహనాల నుంచి కంకర రోడ్డుపై కింద పడి వాటిపై నుంచి వెళ్లే క్రమంలో బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాల పాలైన సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా ఓవర్ లోడ్‌తో తిరిగే లారీలు, టిప్పర్ల వంటి భారీ అధికలోడుతో వెళ్తున్న లారీలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర, డస్టు తదితర సామగ్రి రోడ్డుపై పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. వాహనాలను అధికారులు అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాడవుతోన్న రోడ్లు

కందుకూరు, కడ్తాల్, ఆమన్‌గల్లు మండలాల వైపు ఉన్న క్వారీల నుంచి కంకర, డస్టు, మొరం, క్వాడ్ వంటివి ఇతర ప్రాంతాలకు లారీలు, టిప్పర్ల ద్వారా నిత్యం తరలిస్తున్నారు. వాస్తవంగా నింపాల్సిన బరువు కంటే అదనంగా తరలిస్తున్నారు. 20 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలో 40 నుంచి 50 టన్నుల మేర నింపి తరలిస్తున్నారు. దీంతో రోడ్లు పాడవుతున్నాయి. మరోపక్క అధికంగా నింపిన కంకర, డస్టు వంటివి కింద పడుతూ ఇతర వాహనదారులకు సంకటంగా మారుతున్నాయి. వెనక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడి పలుమార్లు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. కార్లపై పడి అద్దాలు పగిలిపోతున్నాయి. సింగిల్ రహదారుల నుంచే వచ్చే క్రమంలో అధిక బరువుతో వస్తున్న లారీలు ఇతర వాహనదారులకు సైడ్ ఇవ్వకపోవడంతో ఇబ్బందిగా మారుతుంది. ఆ సమయంలో ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు గతంలో ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు సంబంధం లేనివిధంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

కారు అద్దం పగిలింది



ఆరు నెలల క్రితం హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాను. శ్రీశైలం రహదారిపై తుమ్మలూరు గేట్ సమీపంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ నుంచి కంకర కారుపై పడి అద్దం పగిలింది. దాన్ని మార్చడానికి రూ.5,800 ఖర్చయింది.

– బొక్క సంజీవరెడ్డి, కొత్తగూడ

హడలి పోతున్నాం



నెల రోజుల క్రితం కడ్తాల్ పని మీద వెళ్లి కారులో తిరిగి వస్తున్నాను. మార్గ మధ్యలో ముచ్చర్ల గేట్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న టిప్పర్ వాహనాన్ని దాటే క్రమంలో అందులో ఓవర్ లోడ్ ఉన్న కంకర కారుపై పడి అద్దం పగిలింది. టిప్పర్ల పక్క నుంచి వెళ్లాలంటే హడలిపోవాల్సి వస్తోంది. – మెరుగు రాజు, గఫూర్‌నగర్

మహాత్ముడికి ఘన నివాళి



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువుకట్టపై ఉన్న ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె గాంధీజీ సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు లావణ్య, అనిల్‌యాదవ్, నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కామేశ్‌రెడ్డి, రాజ్‌కుమార్, సాయినాథ్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సత్కారం



సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: పహాడీషరీఫ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన గురువారెడ్డిని తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గోగికర్ జానకిరామ్, నాయకులు యాదయ్య, రాజుకుమార్, సురేందర్, రాజు, స్వామి, హెరాల్డ్, శ్రీకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి నూతన కమిటీని ఎన్నుకోలేదు



సమావేశంలో మాట్లాడుతున్న మంకాల శేఖర్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఏర్పాటు చేయలేదని, సంఘం అధ్యక్షుడిగా తానే కొనసాగుతున్నానని మంకాల శేఖర్‌రెడ్డి వెల్లడించారు. కాలనీలో మంగళవారం ఆయన కాలనీ ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, కొంతమంది తాము నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నామని తప్పుడు ప్రచారం చేయడంతో పాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. తమ కాలనీలో ఇప్పటివరకు కొత్తకమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. త్వరలోనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేసుకుంటామని, అప్పటి వరకు తానే అధ్యక్షుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. సమావేశంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఐలేష్‌గౌడ్, ప్రతినిధులు మంద ప్రవీన్‌రెడ్డి, కొండకింది వెంకట్‌రెడ్డి, మంద శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, కె.చిన్నపరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గీత కార్మికుడికి నివాళి

మాడ్గుల: మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు జెల్ల తానయ్యగౌడ్ మంగళవారం మృతిచెందాడు. గ్రామంలో వారి కుటుంబ సభ్యులను కల్వకుర్తి నియోజకవర్గ గౌడసంఘం అధ్యక్షుడు ల్లాజీగౌడ్ పరామర్శించారు. తానయ్యగౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి గౌడసంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాండుగౌడ్, మండల గౌడసంఘం అధ్యక్షుడు నర్సింహగౌడ్, గ్రామఅధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, నాయకులు గంగారవి, యాదయ్య, వెంకట్‌నారాయణగౌడ్, మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.

ఆలయ ఛైర్మన్‌కు నేతల పోటీ !

- కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త పాలకవర్గం
- మహేశ్వరం శ్రీశివగంగా రాజరాజేశ్వర ఆలయ కమిటీపై భారీగా నేతల ఆశలు



శ్రీశివగంగా రాజరాజేశ్వర ఆలయం

మహేశ్వరం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రాల్లో మహేశ్వరంలోని శ్రీశివగంగా రాజరాజేశ్వర దేవాలయం ఒకటి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నియమించిన ఆలయ పాలక వర్గాలను రద్దు చేసి, కొత్తగా నియమిస్తామని ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంత్రి ప్రకటనతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావహులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఆశావహులు హస్తంపార్టీ అగ్రనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రధానంగా ఛైర్మన్ పదవి కోసం మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గద్దగూటి జంగయ్య ముదిరాజ్, పార్టీ మాజీ టౌన్ అధ్యక్షుడు అల్లె కుమార్‌లు పోటీ పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌తో పాటు, కార్యకర్తలు సమావేశమై ఆలయ ఛైర్మన్ పదవిని జంగయ్యముదిరాజ్‌కు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

నూతన కమిటీతో బ్రహ్మోత్సవాలు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు రానుండడంతో నూతన ఆలయ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లను ఎన్నిక చేయాలని హస్తం నేతలు భావిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను నూతన పాలకవర్గం చేతుల మీదుగా నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. వెంటనే పాత పాలకవర్గాన్ని రద్దు చేయించి బ్రహ్మోత్సవాలలోపు కొత్త కమిటీని ఏర్పాటు చేయించి ఉత్సవాలు నిర్వహించాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌లను కలిశారు. త్వరలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మహేశ్వరం ఆలయ కమిటీ ఛైర్మన్‌తో పాటు పాలక వర్గాలను నియమిస్తామని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొఫెసర్ కోదండరాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

చైతన్యపురి: రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం చైతన్యపురి సాయినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ సేవా సమితి భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, గత ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టులను నిర్మించిందని ఆరోపించారు. ప్రతి శాఖలో జీఓల పేరుతో ఉద్యోగాలను తొలగించారన్నారు. ప్రమోషన్లు ఇవ్వకపోవటం, కొత్త నియామకాలు చేపట్టకపోవటం బాధాకరం అన్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, కోశాధికారి ప్రసాదరావు, సభ్యులు మదన్‌మోహన్‌రావు, కృష్ణమూర్తి, బాల్‌రాములు, ఓంప్రకాష్, సంజీవరెడ్డి, మోహన్ సింగ్, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 21, వంకాయ 13, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 19. దొండ 31, ఆలు 21, ఉల్లి 20, గోకర 45, దోస 21, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 23, బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

నేడు ఎల్మినేడులో పట్నం ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ఎల్మినేడు గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నట్లు ఏఈ ఇంద్రాసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎలిమినేడు గ్రామ పంచాయతీ భవన ప్రారంభం కార్యక్రమానికి ఆయన హాజరవుతార్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానుందని ఆయన తెలిపారు.

ప్రధాన సమస్యలు పరిష్కరిస్తా..



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించే రోడ్డు పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో హస్తినాపురంలో సమస్యలు లేకుండా చేస్తానని, జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కానీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఈదుల కంటి సత్యనారాయణరెడ్డి, స్వామిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, బస్వారెడ్డి, రామకష్టారెడ్డి, దేరింగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, జానకీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



సదస్సులో మాట్లాడుతున్న అధికారి సౌమ్య

మండల ఉద్యానవన అధికారి సౌమ్య

మహేశ్వరం: ఆయిల్ పామ్ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని మండల ఉద్యానవన అధికారి సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు సబ్సిడీ అందిస్తుందన్నారు. మొక్కలకు 90 శాతం, డ్రిప్ ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం ఇస్తుందన్నారు. ఓసీ, బీసీ రైతులకు 80 నుంచి 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. సంవత్సరానికి ఎకరానికి రూ.4,200 నాలుగు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చులు సైతం ఇవ్వనుందన్నారు. పండించిన ఆయిల్ పామ్ పంటను ప్రభుత్వమే కంపెనీ చేత కొనుగోలు చేసి కనీస మద్దతు ధర అందిస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లాకు వాల్యూ ఆయిల్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుండె వెంకటేశ్, వాల్యూ ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఏఈఓ దీనా, ఫీల్డ్ అధికారి మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మహేశ్వరం: ప్రజలందరూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రజలపై కార్పొరేట్, మతతత్వ, నిరంకుశ దాడులు పెరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించి రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేసే చర్యలను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కవిత, నాయకులు శేఖర్, జంగయ్య, చంద్రయ్య, శంకర్, శ్రీశైలం, రవి తదితరుల పాల్గొన్నారు.